క్లుప్తంగా

కామాక్షితాయి సేవలో..



బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారిని బెంగళూరు ఐజీపీ చంద్రశేఖర్ తన కుటుంబసభ్యులతో కలిసి మంగళవారం దర్శించుకున్నారు. తొలుత ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు వారిని శేషవస్త్రాలతో సత్కరించారు. ఆలయ చైర్మన్ సుబ్రహ్మణ్యంనాయుడు, ఎస్సై వీర ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు



స్కానింగ్ కేంద్రంలో అధికారుల తనిఖీలు

బుచ్చిరెడ్డిపాళెం: స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్యశాఖ డెమో అధికారి శ్రీనివాసరావు హెచ్చరించారు. బుచ్చిరెడ్డిపాళెంలోని దేవి నర్సింగ్ హోమ్, కేఎమ్, స్వస్తిక్ ఆస్పత్రుల్లోని స్కానింగ్ సెంటర్లను మంగళవారం తనిఖీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. డీఎం హెచ్‌ఓ పెంచలయ్య ఆదేశాల మేరకు తనిఖీ చేశామని తెలిపారు. ఐఈసీని ప్రదర్శించారా అనే అంశాన్ని పరిశీలించారు. హెచ్‌ఈఈఓ నరసింహారావు, హెల్త్ ఎడ్యుకేటర్ సునీత, తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి విశేష పూజలు



విశేషాలంకారంలో ఆంజనేయస్వామి

పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న వీర అభయాంజనేయస్వామికి మంగళవారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు, ప్రత్యేక పూజలు, తిరిగి సాయంత్రం స్వామికి పూజలు, పల్లకి సేవ గావించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఉపాధి పనుల పరిశీలన



కొడవలూరు: మార్చి నెలాఖరు నాటికి ఉపాధి కూలీలు వంద రోజుల పనిని పూర్తి చేసుకోవాలని డ్వామా ఏపీడీ మృదుల సూచించారు. కొడవలూరులో జరుగుతున్న ఉపాధి పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. కూలీలకు పలు సూచనలు చేసిన అనంతరం ఆమె మాట్లాడారు. ప్రతి కుటుంబానికి ఏడాదిలో వంద రోజుల పనిని ప్రభుత్వం కల్పిస్తోందని చెప్పారు. వ్యవసాయ పనులు పూర్తయిన తరుణంలో వంద రోజుల పని కల్పనను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఉపాధి పనులను ఉదయం ఏడు గంటలకే ప్రారంభించడం ద్వారా ఒక్క పూటలోనే రెండుసార్లు యాప్ ద్వారా హాజరు తీసుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

'డీకేడబ్ల్యూ'లో ఎండోమెంట్ లెక్చర్



మాట్లాడుతున్న శ్రీకాంత్

నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో ఎండోమెంట్ లెక్చర్‌ను ఇంగ్లిష్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. లలిత జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన నిధితో ఎండోమెంట్ లెక్చర్ కార్యక్రమాన్ని ఆమె భర్త అభ్యర్థన మేరకు ఏటా నిర్వహిస్తున్నారు. రిసోర్స్ పర్సన్‌గా ప్రముఖ కవి శ్రీకాంత్ వ్యవహరించారు. ఇంగ్లిష్‌ను ఎలాంటి తప్పులతో మాట్లాడతారో ఉదాహరణలతో వివరించారు. ప్రిన్సిపల్ గిరి, వైస్ ప్రిన్సిపల్ రమణరావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ప్రసాద్, అధ్యాపకులు కృష్ణమూర్తి, ఉమామహేశ్వరి, వెంకటేశ్వర్లు, వింద్యావళీ, తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం : రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన కొనసాగుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చవటపాళెం గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని మంత్రి ఆరా తీశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గతంలో ఎన్నడూ లేనివిధంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని స్థానికులు తమ ఆనందాన్ని కాకాణితో పంచుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో ఏ విధంగా అమలవుతున్నాయో తెలుసుకుని, ఇంకా పరిష్కారం కాని సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలనే ఆలోచనతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలియజేశారు. కార్యక్రమంలో అన్నిశాఖల అధికారులతో కలిసి ప్రజల వద్దకే వెళ్లి, సమస్యలు ఉంటే తెలుసుకుని పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.

సోమిరెడ్డి లాంటి నీచమైన వ్యక్తిని ఎన్నడూ చూడలేదు:

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సర్వేపల్లి నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులతో ప్రజలు చాలా సంతోషంగా ఉన్నారని చెప్పారు. అయితే నాలుగు సార్లు ఓటమిపాలైన సోమిరెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించకపోగా, తప్పుడు ప్రచారాలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. సర్వేపల్లి నియోజకవర్గంలో ఎంతో మంది ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా పనిచేశారని, కానీ సోమిరెడ్డి లాంటి నీచమైన వ్యక్తిని ఎన్నడూ చూడలేదని ధ్వజమెత్తారు. ప్రజాభిమానాన్ని పొందలేక పోటీచేసిన ప్రతీసారి ఓటమిపాలై, సిగ్గులేకుండా తప్పుడు ప్రచారాలు చేస్తున్నాడని మండిపడ్డారు. నిరంతరం ప్రజల మధ్యనే తిరుగుతూ, వారి సమస్యలను పరిష్కరించడంతో తాను ఎక్కడకు వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని తెలియజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీఓ సుస్మిత, ఎంపీపీ మందా కవిత, వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య, ఎంపీటీసీ సభ్యుడు వేమారెడ్డి రఘునందన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు జనార్దన్‌నాయుడు, రాజేంద్రప్రసాద్, మురారి నాయుడు, వెంకటకృష్ణయ్యనాయుడు, కంటేపల్లి రమేష్, నాటకం శ్రీనివాసులు, చీకుర్తి నరసయ్య, తాటిపర్తి సురేష్ పాల్గొన్నారు.

ఈ - క్రాప్ నమోదు తప్పనిసరి



తిక్కవరప్పాడులో పంట పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

- వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు శ్రీనివాసులు

వెంకటాచలం : రైతులు తమ పొలాల్లో సాగు చేసిన పంటలకు సంబంధించిన వివరాలను ఈ–క్రాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు ఎం.శ్రీనివాసులు సూచించారు. మండలంలోని అనికేపల్లి, గొలగమూడి, తిక్కవరప్పాడు గ్రామాల్లో మంగళవారం పంట పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు సాగు చేసిన పంటల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రైతు తమ పొలాల్లో సాగు చేసిన పంటను ఫిబ్రవరి 7వ తేదీలోగా ఈ–క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని తెలియజేశారు. ఆయన వెంట వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న ఆంజనేయరెడ్డి

కోవూరు: సబ్ డివిజన్ పరిధిలో నేరాల నియంత్రణకు పోలీస్ సిబ్బంది పటిష్ట చర్యలు చేపట్టారని రూరల్ డీఎస్పీ ఆంజనేయరెడ్డి పేర్కొన్నారు. కోవూరు సీఐ కార్యాలయాన్ని మంగళవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. నేరాల నియంత్రణకు గానూ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని వివరించారు. ఎలాంటి ఆధారం లేని చోరీ కేసులను కోవూరు సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్సై వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఛేదించడాన్ని అభినందించారు. అనంతరం చెర్లోపాళెంలో ఎస్సీ, ఎస్టీ కేసుకు సంబంధించిన విచారణను చేపట్టారు. తొలుత రికార్డులను పరిశీలించారు.

నియోజకవర్గ సర్పంచ్‌ల ప్రతినిధిగా లక్ష్మీకుమారి



అభినందిస్తున్న నిరంజన్‌బాబురెడ్డి

కోవూరు: కోవూరు నియోజకవర్గ తరఫున సర్పంచ్‌ల ప్రతినిధిగా గంగవరం సర్పంచ్ లక్ష్మీకుమారి ఎంపికయ్యారు. తాడేపల్లిలో ఫిబ్రవరి ఒకటిన నిర్వహించనున్న సదస్సుకు ఆమె హాజరుకానున్నారు. ఈ క్రమంలో కోవూరులోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డిని ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ సర్పంచ్‌ల ప్రతినిధిగా తనను ఎంపిక చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డికి ఆమె కృతజ్ఞతలను తెలియజేశారు. ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పతాకావిష్కరణ



పతాకావిష్కరణ కార్యక్రమంలో మంత్రి కాకాణి

వెంకటాచలం : మండలంలోని చవటపాళెం గ్రామంలో వైఎస్సార్‌సీపీ పతాకావిష్కరణ కార్యక్రమం మంగళవారం జరిగింది. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేతుల మీదుగా పతాకావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు.

బహిరంగ వేలం రేపు

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెంలో వెలసిన కోదండరామస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని బహిరంగ వేలాన్ని గురువారం నిర్వహించనున్నామని ఆలయ చైర్మన్ మురళీకృష్ణారెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడారు. ఆలయ బ్రహ్మోత్సవాలను మార్చి 29 నుంచి ఏప్రిల్ 8 వరకు నిర్వహించనున్నామని చెప్పారు. పుష్పాలను సరఫరా చేసేందుకు రూ.50 వేలు, విద్యుద్దీపాలంకరణ, సౌండ్ సిస్టమ్ ఏర్పాటుకు రూ.50 వేలను ధరావతుగా చెల్లించాలని కోరారు. తాత్కాలిక దుకాణాల ఏర్పాటు, బాడుగ వసూలు చేసుకునే హక్కు కోసం రూ.మూడు లక్షలు, టెంకాయలను విక్రయించేందుకు రూ.10 వేలు, పాదరక్షలను భద్రపర్చి వసూలు చేసుకునే హక్కు కోసం రూ.ఐదు వేల ధరావతును చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

సామూహిక లక్ష తులసీ అర్చన నేడు

బుచ్చిరెడ్డిపాళెం: భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని బుచ్చిరెడ్డిపాళెంలో వెలసిన కోదండరామస్వామి ఆలయంలో సామూహిక లక్ష తులసీ అర్చనను బుధవారం నిర్వహించనున్నామని ఆలయ చైర్మన్ మురళీకృష్ణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు తరలిరావాలని కోరారు.

రేపు గంధ మహోత్సవం

పొదలకూరు : పట్టణంలోని అగచాట్లపురం వీధిలో ఉన్న ఖాదర్‌వలీ దర్గా వద్ద గురువారం నుంచి గంధ మహోత్సవ కార్యక్రమాలు ప్రారంభం అవుతాయని నిర్వాహకులు మంగళవారం వెల్లడించారు. తొలిరోజున చదివింపులు, రాత్రి అన్నదాన కార్యక్రమం, సాంస్కృతిక కార్యక్రమాలు, శుక్రవారం ఫకీర్ల వాయిద్యాలు, విద్యుద్దీపాలంకరణ ఉంటుందన్నారు. అత్యంత వైభవంగా జరిగే గంధ మహోత్సవానికి భక్తులు హాజరు కావాల్సిందిగా కోరారు.

ఇష్టంతో చదివితే మంచి ఫలితాలు



మాట్లాడుతున్న భాస్కర్‌గౌడ్

- నెడ్ క్యాప్ డైరెక్టర్ భాస్కర్‌గౌడ్

మనుబోలు : విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని నెడ్ క్యాప్ డైరెక్టర్ భాస్కర్‌గౌడ్ అన్నారు. మనుబోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో వెనుకబడిన విద్యార్థుల ఉత్తీర్ణత శాతం ఎలా పెంచాలి అనే అంశంపై మంగళవారం పురోగాణి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు విద్యార్థులు, తల్లిదండ్రులకు పలు సూచనలు, సలహాలు చేశారు. విద్యార్థులపై ఒత్తిడి పెంచడం మంచిది కాదన్నారు. విద్యార్థులకు మంచి పోషక విలువలున్న ఆహారం, సరిపడినంత నిద్ర ఉండాలన్నారు. కేవలం ఉపాధ్యాయులపైనే ఆధారపడకుండా ఇళ్లల్లో కూడా విద్యార్థులకు సమయం కేటాయించాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం డేవిడ్, జెడ్పీటీసీ సభ్యుడు చిట్టమూరు అనితమ్మ, వైఎస్సార్‌సీపీ నేతలు హరగోపాల్‌రెడ్డి, అజయ్‌కుమార్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో అన్నదానం



బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెంలోని భవిత కేంద్రంలో ఉన్న ప్రత్యేకావసరాల పిల్లలకు అన్నదానాన్ని సేవా సంఘ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఈఓ దిలీప్ మాట్లాడారు. సేవా సంఘం ఏర్పడిన అనంతరం మొదటిసారిగా దివ్యాంగ విద్యార్థులకు అన్నదానం చేయడాన్ని అభినందించారు. సేవా సంఘ సభ్యులు కుమారి, స్వరాజ్యం, అచ్యుత, మౌనిక, మమత, భవిత కేంద్ర ఉపాధ్యాయులు శేషమ్మ, శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సినిమాలకు హబ్‌గా సింహపురి



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న కృష్ణారెడ్డి, తదితరులు

నెల్లూరు(బృందావనం): ఇటీవలి కాలంలో సినిమాలకు హబ్‌గా నెల్లూరు మారిందని 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. నగరానికి చెందిన చంటి దర్శకత్వం వహించిన లైబ్రరీ సినిమాకు సంబంధించిన ట్రైలర్, టీజర్, ఆడియో రిలీజ్ ఫంక్షన్ల బ్రోచర్లను అమరావతి చాంబర్స్‌లో మంగళవారం ఆవిష్కరించిన అనంతరం కృష్ణారెడ్డి మాట్లాడారు. వీఆర్సీ మైదానంలో కార్యక్రమాన్ని ఫిబ్రవరి ఐదో తేదీన నిర్వహించనున్నారని చెప్పారు. ఉచిత పాసులు కావాల్సిన వారు 95506 76365 నంబర్‌ను సంప్రదించాలని చంటి కోరారు. కళాసంఘాల కన్వీనర్లు హరిబాబు, హరనాథ్‌రెడ్డి, అమీర్‌జాన్, భాస్కర్, డ్యాన్స్ మాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్బారెడ్డి, నటుడు నవీన్, తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల బ్రోచర్ల ఆవిష్కరణ

నెల్లూరు(బారకాసు): బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో మోదీ కబడ్డీ పోటీలను నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో త్వరలో నిర్వహించనున్నామని జిల్లా అధ్యక్షుడు యశ్వంత్‌సింగ్ పేర్కొన్నారు. పోటీలకు సంబంధించిన బ్రోచర్లను పార్టీ జిల్లా అధ్యక్షుడు భరత్‌కుమార్‌యాదవ్, తదితరులు మంగళవారం ఆవిష్కరించారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నేతలు రఘురామ్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, విజయలక్ష్మి, అశోక్, విష్ణుతేజ, చంద్ర, ప్రవీణ్, శివ, కిరణ్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన చిన్నారులను బడికి పంపాలి



మాట్లాడుతున్న అధికారులు

కొడవలూరు: ప్రభుత్వం అన్ని వసతులను కల్పిస్తున్న తరుణంలో గిరిజన చిన్నారులు డ్రాపౌట్స్‌గా మారకుండా పాఠశాలలకు వెళ్లేలా తల్లిదండ్రులు చొరవ చూపాలని ఎంఈఓ వసంతకుమారి పేర్కొన్నారు. మండలంలోని దామేగుంట గిరిజన కాలనీలో మంగళవారం నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవంలో ఆమె మాట్లాడారు. పేదరికం నుంచి బయటపడాలంటే విద్యే మార్గమని తెలిపారు. ఏపీఎం రుక్మిణి, ఈఓపీఆర్డీ నాగరాజు, డీటీ మల్లికార్జున, ఆర్ఐ చాణుక్య, పంచాయతీ కార్యదర్శి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

వరిసాగులో ఎలుకల నివారణ కీలకం



బుచ్చిరెడ్డిపాళెం: వరిసాగులో ఎలుకల నివారణ కీలకమని వ్యవసాయ విస్తరణాధికారి అనిత పేర్కొన్నారు. ఎలుకల నివారణపై రేబాలలోని సచివాలయం వద్ద రైతులకు మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఎలుకలను నివారించకపోతే ధాన్యం దిగుబడి తగ్గుతుందని తెలిపారు. రైతులకు మందులను రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తోందని పేర్కొన్నారు. తిరుపతికి చెందిన వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతులకు అవగాహన కల్పించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ సతీష్‌రెడ్డి, మస్తానయ్య, తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్‌కు అభినందన



బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెం 14వ వార్డు కౌన్సిలర్ ప్రసాద్‌ను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగ సభ్యుడిగా తనను కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఎంపిక చేయడంపై ఆనందం వ్యక్తం చేశారు. యువజన విభాగ నియోజకవర్గ అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం కేక్‌ను కట్ చేశారు. పార్టీ మండల కన్వీనర్ సతీష్‌రెడ్డి, సచివాలయ రథసారథుల మానిటరింగ్ పట్టణ కన్వీనర్ మురళి, పార్టీ ఎస్సీ సెల్ పట్టణాధ్యక్షుడు విల్సన్, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు కోసూరు గోవిందయ్య



గోవిందయ్య సంస్మరణ సభలో మాట్లాడుతున్న సంఘ పెద్దలు

తోటపల్లిగూడూరు : గౌడ, కల్లుగీత కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడిన కోసూరు గోవిందయ్య ఆదర్శప్రాయులని గౌడ కల్లుగీత పారిశ్రామిక సంఘం జిల్లా అధ్యక్షుడు తోట ప్రభాకర్‌గౌడ్ పేర్కొన్నారు. మండలంలోని నరుకూరులో కోసూరు గోవిందయ్య సంస్మరణ సభ మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా తోట ప్రభాకర్‌గౌడ్ మాట్లాడుతూ జిల్లాలో గౌడ కులుస్తులను ఏకతాటిపై నడిపించిన వ్యక్తి కోసూరు గోవిందయ్య అని కొనియాడారు. కార్యక్రమంలో సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్ కోసూరు రాజశేఖర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి ఉప్పల రామకృష్ణగౌడ్, జై గౌడ ఉద్యమం జిల్లా అధ్యక్షుడు మన్నెం సుబ్రహ్మణ్యం గౌడ్, నేతలు అన్నం శ్రీనివాసులగౌడ్, డాక్టర్ సుబ్బారావు, మన్నెం చిరంజీవులగౌడ్, నాశిన శీనయ్యగౌడ్, రాజేష్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



నెల్లూరు(బారకాసు): జర్నలిస్టులు, వారి కుటుంబసభ్యుల కోసం ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో దీక్ష హస్పిటల్, హరిత న్యూరోకేర్ సహకారంతో కార్యక్రమాన్ని చేపట్టారు. ఆర్థోపెడిక్ అన్వేష్, గర్భకోశ వ్యాధుల వైద్య నిపుణురాలు హారిక, యూరాలజిస్ట్ గోకుల్ నచికేత్, న్యూరాలజిస్ట్ హరితకుమారి హాజరై వైద్యసేవలను అందించారు. అనంతరం మందులను పంపిణీ చేశారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి జయప్రకాష్, జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

గోవింద నామస్మరణతో పాదయాత్ర



తిరుమలకు బయలుదేరిన భక్తులు

పొదలకూరు : పట్టణంలోని శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థానం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు దిగ్విజయంగా పూర్తి చేసుకున్న సందర్భంగా స్వామి మాలధారణలో ఉన్న భక్తులు మంగళవారం తిరుమలకు పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా 151 మంది భక్తులు ఆలయంలో ఇరుముడులను కట్టుకుని సుప్రభాత సేవ, కైంకర్యాల అనంతరం పాదయాత్రను ప్రారంభించారు. ఆలయ అర్చకుడు శ్రీనివాసాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భీష్మ ఏకాదశి నేడు

పొదలకూరు : స్థానిక శ్రీనివాస లేఅవుట్‌లో ఉన్న లక్ష్మి గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం సాయంత్రం భీష్మ ఏకాదశి సందర్భంగా విష్ణు సహస్రనామ పారాయణం జరుగుతుందని ఆలయ నిర్వాహకులు మంగళవారం తెలిపారు. భక్తులు విచ్చేసి ప్రత్యేక పూజల్లో పాల్గొనాల్సిందిగా కోరారు.